విద్యుత్ సమస్యలను పరిష్కరించండి


విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. బుధవారం గోల్నాక లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. చిన్న పాటి గాలి, వానలకే విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నదన్నారు. దీనిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. పలు ప్రాంతాల్లో కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, శిథిలావస్థకచు చేరిన స్తంభాలు ఉన్నాయని వాటితో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రమాదాలను నివారించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గృహజ్యోతి పథకం అర్హులందరికీ అందేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. డీఈ కమల్ కుమార్, ఏడీ శ్రీనివాస్, ఏఈలు శ్రీనివాస్, అంజన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

7న సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ ఎన్నికలు


అభ్యర్థులకు ఎన్నికల నియమాలను వివరిస్తున్న సంఘర్ జాతి సంఘ్ ఎన్నికల కమిటీ చైర్మన్

నల్లకుంట: సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ నూతన కమిటీ ఎన్నికలు ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఎలక్షన్ కమిటీ చైర్మన్ ఎం.సురేష్ తెలిపారు. బుధవారం కమిటీ ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసింది. చివరి రోజు పలువురు తమ నామినేషన్లను ఎన్నికల కమిటీ చైర్మన్‌కు అందజేశారు. అధ్యక్షుడిగా కె.లక్ష్మణ్ కుమార్, కె.కైలాష్, ప్రధాన కార్యదర్శిగా పి.నర్సింగ్‌రావు, కోశాధికారిగా ఎ.సంతోష్ కుమార్, కె.లక్ష్మణ్ ప్రసాద్‌లు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికల చైర్మన్ రమేష్ మాట్లాడుతూ... ఈ నెల 3, 4 తేదీలలో నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, 5, 6 తేదీలలో అభ్యర్థులు ప్రచారం చేసుకోవచ్చన్నారు. 7న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు, అనంతరం విజేతల పేర్లు ప్రకటన ఉంటుందని వివరించారు. ఎన్నికలు ప్రశాంత యుత వాతావరణంలో జరిగేలా అభ్యర్థులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

కాచిగూడ: విద్యార్థులు మంచిగా చదువుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. బుధవారం కాచిగూడ, మోతీమార్కెట్‌లోని ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆమె నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. బీజేపీ నేతలు సుభాష్ పటేల్, ఆర్.సంతోష్, కె.మురళీమనోహర్ రావు, శైలేందర్, భీమ్, ఓంప్రకాష్, వాసు, సూరి, రవియాదవ్ పాఠశాల హెచ్‌ఎం గాయత్రి దేశాయ్, చాయా, సి.వి.రమణ, ఎం.నళినాక్షి, బి.సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్

అంబర్‌పేట: జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన అంశాలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆ పార్టీ బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆమె కేటీఆర్‌ను కలిసి జీహెచ్‌ఎంసీ పరిధిలో నెలకొన్న ప్రధాన సమస్యలను ఆయనకు వివరించారు. గురువారం కౌన్సిల్ సమావేశం జరగనున్న నేపథ్యంలో పలు అంశాలను చర్చించినట్లు ఆమె వెల్లడించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, సంజీవ్ చౌదరి, వెంకటరమణరాజు, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నిరుద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి యుద్ధప్రాతిపదికన స్పందించి పరిష్కరించాలని వామపక్ష యువజన, విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి డిమాండ్ చేసింది. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వివరించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో (డీవైఎఫ్‌ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ)ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇబ్బందులు కలగకుండా ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. నేడు రాష్ట్రంలో నిరుద్యోగులు అన్ని రకాలుగా సమస్యలతో సతమతమువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను అనుసరిస్తే అదే పరిస్థితి నేడు కాంగ్రెస్‌కు కూడా వస్తుందని హెచ్చరించారు. నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం నిలబడాలని, వారి సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక్షంగా హామీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, వెంకటేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి రామకృష్ణ, నామాల ఆజాద్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, పీడీఎస్‌యూ యూనివర్సిటీల జాతీయ కో-ఆర్డినేటర్ ఎస్.నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు రమేష్, ఏఐవైఎఫ్ నాయకులు అనిల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచుదాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం



కాచిగూడ: మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టి పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని స్కూల్ అసిస్టెంట్ టీచర్ ఎం.విజయలక్ష్మీ అన్నారు. కాచిగూడలోని మార్వాడీ హిందీ విద్యాలయం, హెడ మోడల్ హైస్కూల్ ఆధ్వర్యంలో బుధవారం హరిత హారం ర్యాలీ నిర్వహించారు. చెట్ల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి ఒక్కరూ చెట్లను సంరక్షించుకోవాలని సూచించారు. స్కూల్ ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటి కాచిగూడ, ఇసామియాబజార్, చెప్పల్‌బజార్, నింబోలిఅడ్డ తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాలుష్యాన్ని తొలగించేందుకు మొక్కల పెంపకం దోహదపడుతుందన్నారు. స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కృషి

కవాడిగూడ: ఆర్టీసి కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం ఎల్లప్పుడు సిద్ధంగా ఉందని టీజీఎస్ ఆర్టీసీ హైదరాబాద్ రీజనల్ మేనేజర్ వరప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ముషీరాబాద్ డిపోలో ఉద్యోగుల విశ్రాంతి గది, శిక్షణాలయాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టీసి ఉద్యోగుల పనితీరు మెరుగుపర్చుకోవడానికి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి ఈ శిక్షణాలయం ఉపయోగపడుతుందన్నారు. ఆర్టీసీ బలోపేతానికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి కార్మికులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. డిపో మేనేజర్ కిషన్‌రావు, అడిషనల్ మేనేజర్ (ట్రాఫిక్) కల్యాణి, శివలాల్, అడిషనల్ మేనేజర్ ఫైనాన్స్ జ్యోతిక, కంట్రోలర్ సీస నర్సయ్యగౌడ్ తదితరులున్నారు.

తల్లితో సన్నిహితంగా ఉండొద్దన్నందుకు కుమారుడిపై దాడి

అంబర్‌పేట: తల్లితో చనువుగా ఉండొద్దని మందలించినందుకు ఓ యువకుడిపై నలుగురు దాడి చేశారు. అతని వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులను దోచుకెళ్లారు. బుధవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్‌ఐ విజయ్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బాగ్ అంబర్‌పేట పోచమ్మ బస్తీలో నివాసించే చప్పిడి రాకేశ్ తల్లి అదే ప్రాంతంలో కర్రీ పాయింట్ నిర్వహిస్తుంది. ఇందులో కర్నూలుకు చెందిన షేక్ షాలీమ్ పనిచేస్తున్నాడు. తల్లితో ఇతను హద్దులు దాటి సన్నిహితంగా ఉండటాన్ని గమనించిన రాకేశ్ తన ఫోన్‌లో ఫొటో తీసి ఆయనను మందలించాడు. ఇది మనసులో పెట్టుకున్న షేక్ షాలిమ్ తన స్వగ్రామానికి వెళ్లి స్నేహితులైన షేక్ షలామ్ బాషా, రాజు, నవీన్, ఉదయ్‌లను ఏపీ(21బీఎమ్7323) కారులో గత నెల 29న రాకేశ్ ఇంట్లోకి చొరబడ్డారు. అతనిపై దాడి చేసి ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. దాడికి ప్రధాన నిందితుడు అయిన షేక్ షాలీమ్‌ను పట్టుకొగా మిగతా నిందితులు పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పట్టుబడ్డ నిందితుడిని నుంచి ల్యాప్‌ట్యాప్, మూడు సెల్‌ఫోన్‌లు, కారును స్వాధీనం చేసుకున్నమన్నారు. షేక్ షాలీమ్‌ను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి...



డ్రగ్స్‌పై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

మత్తు.. భవిత చిత్తు

- మాదకద్రవ్యాలతో జీవితం అంధకారమే
- డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి
- విద్యార్థులకు ఫొటో ఎగ్జిబిషన్‌తో అవగాహన


డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన, ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కాచిగూడ: యువత మత్తుకు బానిసలైతే భవిష్యత్ అంధకారం అవుతుందని, క్రమశిక్షణతో మెలగి కుటుంబ గౌరవాన్ని కాపాడుకోవాలని డిప్యూటీ డీఈఓ ఎం.విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం-సమాజాన్ని మేల్కొలుపుదాం' అనే అంశంపై బుధవారం కాచిగూడ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అనుమానాలు వచ్చినా విద్యార్థులు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. 35 శాతం యువత మత్తుబారిన పడుతోందని, దీనిని నివారించాలంటే మత్తు పదార్థాల విక్రేతలు, ఉత్పత్తిదారులకు కఠిన శిక్షలు అమలు చేయాల్సిన అవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. యువత ఉన్నత ఆశయాలతో ముందుకు సాగి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ వైఎస్ స్వర్ణలత మాట్లాడుతూ... మత్తు పదార్థాలకు బానిసై.. జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. చదువుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ వినియోగం పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. మాదకద్రవ్యాలను వినియోగించడం ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్ర నష్టదాయకమన్నారు. మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని విద్యార్థులకు ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐఓ సుమన్, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ హేమలత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసంత, కాచిగూడ గవర్నమెంట్ హైస్కూల్ హెడ్‌మాస్టర్ విజయలక్ష్మి, డాక్టర్ లక్ష్మయ్య, ప్రసాద్, ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి ఎస్.మారన్న, రాము, రఘు, డిజి.నర్సింహారావు, డి.మహారాజు, సునిత, జంగయ్య, జనార్ధన్, మల్లేష్, వీరయ్య, జేకే శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియామకం


పంతంగి లక్ష్మీప్రసన్న

కాచిగూడ: తెలంగాణ బాటిల్ స్పోర్ట్స్ డాన్స్ సెక్రటరీగా పంతంగి లక్ష్మీప్రసన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన బాటిల్ స్పోర్ట్స్ డాన్స్ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు నిఖిల్ తాంబే రాష్ట్ర సెక్రటరీగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ... తెలంగాణలో బాటిల్ స్పోర్ట్స్ డాన్స్ క్రీడలను ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు తన వంతుగా నిరంతరం కృషి చేస్తానని అన్నారు. క్రీడాకారులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామీణ స్థాయి వరకు ఈ క్రీడలను విస్తరింప చేస్తామని ఆమె తెలిపారు.

కాపులకు టీ పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి

కాచిగూడ: టీపీసీసీ అధ్యక్ష పదవి కాపు, మున్నూరు కాపులకు ఇవ్వాలని తెలంగాణ కాపునాడు అధ్యక్షుడు గంధం కరుణాకర్ నాయుడు కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, జాతీయ నేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేకు లేఖలు రాసినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో అత్యధిక జనాభా ఉండి రాజకీయాలను శాసించే స్థాయిలో ఉన్న కాపు, మున్నూరు కాపులకు టీ పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు.

21న వ్యక్తిత్వ విశ్లేషణపై శిక్షణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సైకాలజిస్టుల నైపుణ్యాభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ పనిచేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ తెలిపారు. ఈనెల 21న నగరంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మానవ సంబంధాలు వారి వ్యక్తిత్వ విశ్లేషణపై సైకాలజిస్టులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సైకాలజిస్టుల నైపుణ్యాలను పెంపొందించేందుకు నిరంతరం కౌన్సెలింగ్, విద్య పేరున శిక్షణ అందిస్తున్నామన్నారు. వ్యక్తుల మధ్య సంబంధాలు పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. వ్యక్తిత్వాన్ని అంచనా వేసేందుకు వివిధ నైపుణ్యాలను అర్థం చేసుకోవడానికి ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. సైకాలజిస్టులు పెద్దఎత్తున పాల్గొనాలని సూచించారు. సంఘం కార్యదర్శి రాజు, శ్రీపూజ, సుధాకర్, సాహితి పాల్గొన్నారు.

11 ద్విచక్ర వాహనాలు సీజ్

కాచిగూడ: కాచిగూడ-లింగంపల్లి చౌరస్తాలో పోలీసులు మంగళవారం రాత్రి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి, సరైన పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పి.లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. వాహనాలు నడుపుతున్న సమయంలో వాహనాలకు సంబంధించిన పత్రాలను దగ్గర ఉంచుకోవాలని ఆయన సూచించారు. లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని అన్నారు. ఎస్‌ఐలు సుభాష్, నరేష్, రవి కుమార్‌లతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొని వాహనాలను తనిఖీలు చేశారు.

బడ్జెట్‌లో బీసీలకు రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ


మాట్లాడుతున్న గుజ్జ కృష్ణ

కాచిగూడ: కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, పి.సుధాకర్, నందగోపాల్, రఘుపతి దొడ్డిపల్లిలతో కలిసి ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధికి బడ్జెట్ కేటాయించకుండా అన్యాయం చేస్తున్నదని దుయ్యబట్టారు. ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్ రూ. 45 లక్షల 90 వేల కోట్లు కేటాయిస్తే బీసీలకు రూ. 2 వేల కోట్లు మాత్రమే కేటాయిస్తే ఏ మూలకు సరిపోతుందని ప్రశ్నించారు. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో నైనా బీసీలను ఆదుకునే విధంగా రూ. 2 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసినట్లు ఆయన పేర్కొన్నారు. బీసీల అభివృద్ధికి ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టాలని కోరారు. ఎస్సీ,ఎస్టీ యాక్ట్ మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పిస్తూ బీసీ యాక్ట్ తీసుకురావాలని ప్రధాని నరేంద్రమోడీకి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. జనాభా లెక్కలలో బీసీ కులాల వారీగా లెక్కలు సేకరించాలన్నారు.

బీసీల సమస్యలను పరిష్కరించకపోతే పార్లమెంట్‌ను ముట్టడిస్తాం...

బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే పార్లమెంట్‌ను ముట్టడిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో పలువురు కేంద్ర మంత్రులను కలిసి బీసీల సమస్యలను వివరిస్తూ వినతి పత్రాలను అందజేసినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సీపీఎల్ రోడ్‌లో అక్రమ పార్కింగ్‌లపై ఫిర్యాదు


ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

అంబర్‌పేట: రోడ్లపై అక్రమ పార్కింగ్ పై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అంబర్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లెనిన్ బాబుకు ఫిర్యాదు చేశబూరు. బుధవారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌ను కలిసి అంబర్‌పేట డివిజన్ సీపీఎల్ రోడ్‌లోని లకోఠియా ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రేమ నగర్, గ్రీన్ ల్యాండ్ హోటల్, పటేల్‌నగర్ చౌరస్తా వరకు పెద్ద పెద్ద వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారని వారు ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం విచారకరం అని ఇన్‌స్పెక్టర్‌కు స్పష్టం చేశారు. అక్రమ పార్కింగ్‌కు తోడు వారానికి రెండు సార్లు కూరగాయాల మార్కెట్ ఏర్పాటు చేయడంతో వందలాది వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో నో పార్కింగ్ జోన్‌ను ఏర్పాటు చేసి అక్రమ పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. బీజేపీ నాయకులు ఆనంద్‌గౌడ్, శ్యాంరాజ్, భూషణ్‌చారి, యశ్వంత్, మహిలారం రాజు, యాదగిరి, వెంకటేష్‌గౌడ్, దయాకర్ యాదవ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ లక్ష్మణ్ జన్మదిన వేడుకలు


అన్నదానం చేస్తున్న కె.రాహుల్ తదితరులు

చిక్కడపల్లి: బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని లక్ష్మణ్ కుమారుడు రాహుల్ ముఖ్యఅతిథిగా ప్రారంభించి మాట్లాడారు. క్రమశిక్షణతో అంచెలంచెలుగా గల్లీనుంచి ఢిల్లీవరకు ఎదిగిన సమర్థవంతమైన నాయకుడు లక్ష్మణ్ అని కొనియాడారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నేతలు, శివాజీ, బాబురావు, అరుణ్, సురేష్, స్వామిరావు, రాజేష్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


గోల్నాకలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. నియోజకవర్గంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులకు సూచించారు. బుధవారం గోల్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. పేరుకుపోయిన చెత్త కుప్పలు, మట్టికుప్పలను శుభ్రం చేయించారు. అంతర్గత రోడ్లు, వీధి దీపాలు వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానన్నారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాజ్యసభ ఎంపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ జన్మదినం సందర్భంగా బుధవారం బాగ్‌లింగంపల్లిలోని నైబర్‌హుడ్ కమ్యూనిటీహాల్‌లో పేదలు, గర్భిణీలు, బాలింతలకు న్యూట్రిషన్ ఫుడ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తమ పార్టీ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. డివిజన్‌లోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తమవంతుగా కృషి చేస్తున్నానన్నారు. డాక్టర్ కె.లక్ష్మణ్ కుమారుడు రాహుల్, బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ రమేష్‌రామ్, గడ్డం నవీన్, గడ్డం సతీష్, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీను, కె.ఉపేందర్ తదితరులున్నారు.

నియామకం

ముషీరాబాద్: అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాంనగర్ డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా కల్వ సీతార నియమితులయ్యారు. బుధవారం రాంనగర్‌లో జరిగిన వైశ్య ఫెడరేషన్ సమావేశంలో ఫెడరేషన్ అంతర్జాతీయ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఫెడరేషన్ సలహాబోర్డు చైర్మన్ గంజి రాజమౌళి గుప్తాలు ప్రకటించి ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాంనగర్ డివిజన్‌లోని ఆర్యవైశ్య మహిళల సంక్షేమం, ఉపాధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నేతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ ప్రధాన కార్యదర్శిగా సంగీత నియమితులైనట్లు అధ్యక్షురాలు ప్రకటించారు.

టౌన్‌ప్లానింగ్ అధికారిపై దురుసు ప్రవర్తన

కేసు నమోదు చేసిన పోలీసులు

ముషీరాబాద్: తమ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతూ.. దుర్భాషలాడిన ఓ కార్పొరేటర్ కుమారుడు, అతడి అనుచరుడిపై చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది బుధవారం వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ విభాగం లైన్‌మెన్ జగన్, న్యాక్ ఇంజినీర్‌లు అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్ గుండు సమీపంలో ఓ భవన నిర్మాణాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. కాగా స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కొలతలు తీసుకుంటుండగా.. కార్పొరేటర్ సునీత అనుచరుడు శివ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది జగన్‌కు ఫోన్‌చేసి అక్కడికి ఎందుకు వెళ్లారని, బెదిరింపులకు పాల్పడ్డాడు. కొద్దిసేపటికి కార్పొరేటర్ కుమారుడు తరుణ్ సైతం జగన్‌కు ఫోన్ చేసి దుర్భాషలాడారు. 'తనకు తెలియకుండా నిర్మాణం చేపడుతున్న భవనం వద్దకు ఎందుకు వెళ్లావంటూ'.. బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెదిరింపులు, విధులకు ఆటంకం, నానా దుర్భాషలాడిన కార్పొరేటర్ కుమారుడు, అనుచరుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవాదాయ శాఖలో ఈవో పోస్టులను భర్తీ చేయాలి

ముషీరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈనెల 6న భేటీ అవుతున్న సందర్భంగా ఉభయ రాష్ట్రాల విభజన చట్టంలో ప్రతిపాదించిన విధంగా ఏపీ నుంచి తెలంగాణ దేవాదాయశాఖకు రావాల్సిన పెండింగ్ బకాయిలు రూ. 1000 కోట్లు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. బుధవారం అడిక్‌మెట్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం కొండూరి కృష్ణమాచారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ధార్మిక పరిషత్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. పదవీవిరమణ పొందిన ప్రతి అర్చకుడికి రూ.10 లక్షల గ్రాట్యూటీ ఇవ్వాలని, పదేళ్ల సర్వీసు పూర్తిచేసి ప్రతి అర్చకుడు, ఉద్యోగికి రూ.25 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ 1980లో రెవెన్యూ శాఖ నుంచి విడిపోయిన తర్వాత మూడుసార్లు మాత్రమే ఈవో పోస్టులు భర్తీ చేశారన్నారు ప్రస్తుతం ఉన్న 230 పోస్టులతో పాటు మరో 190 ఈవో పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో 16 వేల దేవాలయాలు ఉన్నాయని ఈ దేవాలయాలకు సుమారుగా 1.21 లక్షల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు వివరించారు. కొన్నిచోట్ల ఎకరం రూ.100 వరకు ధర పలుకుతుందన్నారు. ఇప్పటికే 30 వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయని, గతంలో ప్రతిపాదించిన 190 ఈవో పోస్టులను భర్తీచేసి దేవాదాయ భూములను అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని కోరారు. అసెంబ్లీలో నూతన చట్టాన్ని తీసుకువచ్చి అమలు చేయాలని విన్నవించారు. అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండూరి కృష్ణమాచార్యులు, అర్చక కన్వీనర్ రవీంద్రచారి, కో- కన్వీనర్ బద్రినాథచార్యులు, జాయింట్ సెక్రటరీ జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు గంధం కరుణాకర్‌నాయుడు, చైర్మన్‌గా వరదాచార్యులను నూతన కమిటీలోకి ఆహ్వానించారు.

భార్యతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య

చిక్కడపల్లి: భార్యతో గొడవ పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్సై నాగరాజులు తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కడపల్లి వివేక్‌నగర్‌బస్తీకి చెందిన నాగరాజు (38) ఆటోడ్రైవర్, భార్య పద్మ ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కాగా ఆటో డ్రైవర్‌గా పనిచేసే నాగరాజు కొద్ది రోజులుగా పని మానేసి ఇంట్లోనే ఉంటున్నారు. మంగళవారం భార్యతో గొడవ పడ్డాడు. దీంతో రూమ్‌లోకి వెళ్లి ఎంతసేపటికి బయటకు రాలేదు. తలుపు పగలగొట్టి చూసేసరికి భర్త ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. ఈ మేకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.